సీతాఫలం.. అధరహో

- సామాన్యులకు అందనంత ఎత్తులో ధర
- నియోజకవర్గంలోని మార్కెట్‌లకు వస్తున్న సీతాఫలాలు
- ఏజెన్సీ ప్రాంతాల్లో పంట అధికం





రావులపాలెం హైవే రోడ్డులో సీతాఫలాల విక్రయాలు జరుపుతున్న వ్యాపారులు

రావులపాలెం: సీతాఫలం.. ఈ పండు పేరు చెప్పగానే ఇష్టపడని వారుండరు. చిన్నారుల నుంచి పెద్దల వరకూ ఎంతో ఇష్టంగా ఆరగిస్తారు. ప్రస్తుతం సీతాఫలాలు మార్కెట్‌లోకి విరివిగా వస్తున్నాయి. సీజన్ కావడంతో ఈ ఫలాలను కొనేందుకు ప్రజలు అంతా ఆసక్తి చూపుతున్నారు. కొత్తపేట నియోజకవర్గ వ్యాప్తంగా నాలుగు మండలాల్లో వీటి అమ్మకాలు జోరందుకున్నాయి. అయితే ధర మాత్రం ఆకాశాన్నంటడంతో సామాన్యులు ఇబ్బంది పడుతున్నారు. ఈ పంట అధికంగా మెట్ట, ఏజెన్సీ ప్రాంతాల్లో పండుతుంది. ఇప్పటివరకూ విశాఖపట్నం, విజయనగరం జిల్లాలకు చెందిన సీతాఫలాలు ఎక్కువగా మార్కెట్‌లోకి దిగుమతి చేసుకున్నారు. ఇప్పుడిప్పుడే ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాకు చెందిన సీతాఫలాల పంట మార్కెట్‌కు వస్తుంది. రాజానగరం, రంగంపేట మండలాల్లో ఈ తోటలు ఎక్కువగా ఉన్నాయి. ఇక్కడి నుంచి హోల్‌సేల్ మార్కెట్‌లో వంద సీతాఫలం రూ.1,500 వరకూ కొనుగోలు చేస్తున్నట్టు వ్యాపారులు చెబుతున్నారు.

వ్యాపారులు హోల్‌సేల్‌గా కొన్న పండ్లను గ్రేడింగ్ చేసి 25 పండ్లను రూ.300 నుంచి రూ.800 వరకూ అమ్ముతున్నారు. బాగా పెద్దవైతే 12 పండ్లు రూ.400 వరకూ అమ్ముతున్నారు. రావులపాలెం, కొత్తపేట, ఆలమూరు, ఆత్రేయపురం మండలాల్లో ప్రధాన రహదారుల్లో, హైవే సర్వీసు రోడ్లలో ఈ విక్రయాలు జరుపుతున్నారు. ధర అధికంగా ఉండటంతో సీతాఫలాలు కొనేందుకు సామాన్యులు ఆందోళన చెందుతున్నారు. కొందరు ధరలను లెక్క చేయకుండా కొనుగోలు చేస్తున్నారు.

ఫలాలు కొనేందుకు ఆలోచిస్తున్నాం



సీతాఫలం అంటే ఇంటిల్లిపాదికీ ఇష్టమైన ఫలమే. ధర చూస్తేనే కష్టంగా ఉంది. పిల్లలు ఇష్టపడుతున్నా కొనేందుకు తటాపటాయించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ధర చూస్తే కొనేలా లేవు. పంట తక్కువగా ఉండటంతోనే అధిక ధరలు అని వ్యాపారులు చెబుతున్నారు.

– ఎం.అయ్యప్ప, రావులపాలెం.

గుండె అదిరిపోతుంది



సీతాఫలం అంటే ఇష్టపడని వారు ఉండరు. సీజనల్‌గా వచ్చే పండ్లు కావడంతో పిల్లలు బాగా ఇష్టపడుతున్నారు. అయినా ధర చూస్తే గుండె అదిరిపోతుంది. ఇప్పటి వరకూ విజయనగరం, విశాఖపట్నం, శ్రీకాకుళం జిల్లాల నుంచి సీతాఫలాలు దిగుమతి చేసి వ్యాపారులు అమ్మకాలు చేశారు. ఇప్పుడిప్పుడే ఈ జిల్లాల పంట అందుబాటులోకి వస్తుంది.

– కె.అచ్చిరెడ్డి, ఊబలంక

నులి పురుగుల నివారణలో ..

సీతాఫలం అమృత తుల్యంగా చెప్పవచ్చు. గుండె జబ్బులు ఉన్నవారు సీజన్ ఉన్నంత వరకూ ఈ ఫలాలను తీసుకోవచ్చు. విటమిన్లు, లవణాలు అధికంగా ఉండటంతో పాటు కొవ్వు ఏ మాత్రం ఉండని ఒక్కో సీతాఫలంలో 200 క్యాలరీల వరకూ శక్తి లభిస్తుంది. కార్బో హైడ్రోట్లు 48, ఫైబర్ ఆరు గ్రాములు, సోడియం పది మిల్లీ గ్రాములు, విటమిన్-సి 50, కాల్షియం రెండు, ఐరన్‌నాలుగు శాతం లభిస్తుంది. పేగుల్లో ఉండే హెల్మింత్స్ అనే నులి పురుగుల నివారణలో సీతాఫలం ప్రభావవంతంగా పని చేస్తుందని వైద్య పరిశోధనల్లో తేలింది. అయితే ఆస్తమా, మధుమేహం ఉన్నవారు మాత్రం సీతాఫలాలను ఆరగించకూడదు. సీతాఫలంలో ఉండే గ్లూకోజ్ కారణంగా చక్కెర వ్యాధిగ్రస్తులకు ఎక్కువ హాని కలిగిస్తుంది.

క్లుప్తంగా

10న బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ నివేదిక



చిన్నరాజా, శివకుమార్‌ను సన్మానించిన గొల్లపల్లి సూర్యారావు

మలికిపురం: రాజోలు నియోజకవర్గంలో ఇటీవల గ్రామ గ్రామానా విజయవంతంగా వైఎస్సార్ సీపీ నిర్వహించిన బాబు ష్యూరిటీ.. మోసం గ్యారంటీ నివేదిక ఈ నెల 10న జిల్లా అధ్యక్షుడు చిర్ల జగ్గిరెడ్డి, పార్లమెంట్ నియోజకవర్గ పరిశీలకులు జక్కంపూడి విజయలక్ష్మికి అందించనున్నట్లు మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు పేర్కొన్నారు. సోమవారం మలికిపురం పార్టీ కార్యాలయంలో ఇటీవల రాష్ట్ర పార్టీ పదవులు పొందిన నాయకులను గొల్లపల్లి సన్మానించారు. రాష్ట్ర కార్యదర్శిగా పాటి శివకుమార్, సంయుక్త కార్యదర్శిగా రుద్రరాజ చిన్నరాజా నియమితులయ్యారు. వీరిని నాయకుల సమక్షంలో సన్మానించారు. ఆయన మాట్లాడుతూ, నియోజకవర్గంలో బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ కార్యక్రమాలకు ప్రజల నుంచి విశేష స్పందన లభించిందన్నారు. దీనిపై రూపొందించిన నివేదికను పార్టీ శ్రేణులతో కలిసి జగ్గిరెడ్డి, విజయలక్ష్మికి అందిస్తామన్నారు. పార్టీ పదవులు పొందిన నాయకులపై భవిష్యత్‌లో గురుతర బాధ్యతలు ఉన్నాయన్నారు.

విద్యారంగ సమస్యలపై రణభేరి



మామిడికుదురులో రణభేరి పోస్టర్లు ఆవిష్కరిస్తున్న యూటీఎఫ్ ప్రతినిధులు

మామిడికుదురు: విద్యారంగ ఆర్థిక సమస్యలపై ఈ నెల 15 నుంచి 19వ తేదీ వరకు రాష్ట్ర వ్యాప్తంగా రణభేరి కార్యక్రమం నిర్వహిస్తున్నామని యూటీఎఫ్ జిల్లా కోశాధికారి సీహెచ్ కేశవరావు తెలిపారు. మామిడికుదురు ఎమ్మార్సీ వద్ద సోమవారం రణభేరి పోస్టర్లను ఆవిష్కరించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి 15 నెలలు గడచినా ఏ ఒక్క సమస్య పరిష్కారం కాలేదని కేశవరావు పేర్కొన్నారు. బోధనేతర పనులు విపరీతంగా పెరిగిపోయి బోధనకు సమయం సరిపోవట్లేదని ఆందోళన వ్యక్తం చేశారు. పరీక్షల మూల్యాంకనం, విద్యాశక్తి ఆన్‌లైన్, అప్‌లోడ్, గ్రీన్ పాస్‌పోర్టు, పీ–4 వంటి అనేక బోధనేతర పనులతో ఉపాధ్యాయులను వేధిస్తున్నారని, తక్షణం పీఆర్సీ కమిషన్ నియమించి మధ్యంతర భృతి ప్రకటించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండల శాఖ అధ్యక్షుడు జి.నాగేంద్రప్రసాద్, ప్రధాన కార్యదర్శి బాలం పెద్దిరాజు, పీఎస్‌వీ సత్యబాబు పాల్గొన్నారు.

కొత్తపేట: ఆర్థిక, విద్యారంగ సమస్యలపై యూటీఎఫ్ రాష్ట్రస్థాయిలో తలపెట్టిన నిరసన కార్యక్రమాలు జయప్రదం చేయాలని యూటీఎఫ్ మండల శాఖ నాయకులు పిలుపునిచ్చారు. ఆ మేరకు స్థానిక ఎంఆర్సీ కార్యాలయం వద్ద పోస్టర్స్ ఆవిష్కరించారు. సంఘ నాయకులు మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం ఏర్పడి 15 నెలలు గడచినా ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యలు ఒక్కటి కూడా పరిష్కారం కాలేదని, ప్రధానంగా ఆర్థిక, విద్యారంగ సమస్యలు పరిష్కారం కాకపోగా మరింత జటిలంగా మారుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. 25న విజయవాడలో భారీ బహిరంగ సభ నిర్వహిస్తున్నట్టు తెలిపారు.

బకాయిలు విడుదల చేయాలని వినతి

రాజోలు: జీతాల బకాయిలు విడుదల చేయాలని కోరుతూ 104 వాహన సిబ్బంది జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ దుర్గారావు దొరకు సోమవారం వినతిపత్రాన్ని అందజేశారు. విధి నిర్వహణలో ఎదుర్కొంటున్న సమస్యలు, జీతాలు తగ్గుదల అంశాలపై డీఎం అండ్ హెచ్‌ఓకు వివరించారు. అరబిందో యాజమాన్యం జీతాలు విడుదల చేయక చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని యూనియన్ నాయకులు తెలిపారు. అధ్యక్షులు సవరపు సతీష్, మల్లవరపు జగ్జీవన్ రావు, వనచర్ల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

శివలింగం ఏర్పాటుకు వినతి

ఆలమూరు: మండలంలోని నర్సిపూడిలో ఉన్న చెరువులో మహా శివలింగం ఏర్పాటుకు అనుమతిని ఇవ్వాలంటూ గ్రామస్తులు మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో వినతిపత్రాన్ని సోమవారం అందజేశారు. ఈ చెరువులో ఇప్పటికే శ్రీలక్ష్మీ నారాయణస్వామి ఆలయం ఉన్నప్పటికీ ఆలయ దక్షిణ భాగం వైపు మహా శివలింగం, వారధి నిర్మించేందుకు గ్రామస్తులు కోరుతున్నందున అనుమతివ్వాలని అందులో పేర్కొన్నారు.

సీడబ్ల్యూఏ ప్రెసిడెంట్‌గా ప్రసాద్

కొత్తపేట: మండలంలో 28 ఏళ్లుగా క్రైస్తవ పాస్టర్లు ఐక్యతతో కొనసాగుతున్న సీడబ్ల్యూఏ నూతన కార్యవర్గాన్ని సోమవారం ఎన్నుకున్నారు. వాడపాలెం సీడబ్ల్యూఏ గ్రౌండ్ వద్ద జిల్లా నాయకుడు చిరంజీవిరాజు, రెవరెండ్ సత్య పర్యవేక్షణలో నిర్వహించిన ఎన్నికలో ప్రెసిడెంట్‌గా అడపా ప్రసాద్, వైస్ ప్రెసిడెంట్‌గా రెవ వడ్డియ్య స్వర్ణన్, సెక్రటరీగా పిల్లి ప్రభాకర్, జాయింట్ సెక్రటరీగా జైపాల్, కోశాధికారిగా దేవదాస్, ఉప కోశాధికారిగా రాజబాబు, గౌరవ అధ్యక్షునిగా సామ్యూల్‌రాజు, గౌరవ సలహాదారులుగా స్వర్ణన్, యేసేపు, సీహెచ్ ప్రకాష్, సత్యానందం ఎన్నికయ్యారు.

జగన్ పాలన రైతులకు స్వర్ణ యుగం



మలికిపురంలో అన్నదాత పోరు వాల్ పోస్టర్ ఆవిష్కరించిన గొల్లపల్లి సూర్యారావు, నాయకులు

మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు

మలికిపురం: వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎంగా ఉన్న సమయం రైతులకు స్వర్ణ యుగమని మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు అన్నారు. మంగళవారం అమలాపురంలో జరిగే అన్నదాత పోరు కార్యక్రమంపై సోమవారం మలికిపురం పార్టీ కార్యాలయంలో పార్టీ నాయకులు, కార్యకర్తల సమావేశం జరిగింది. అన్నదాత పోరు వాల్ పోస్టర్‌ను సూర్యరావు, నాయకులు ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడారు. అమలాపురంలో వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో జరిగే అన్నదాత పోరు బాట కార్యక్రమం విజయవంతం చేయాలని పేర్కొన్నారు. పోరాటం చేయకపోతే ఈ ప్రభుత్వం పనిచేయదని అన్నారు. జగన్ పోరాటంతోనే ఎరువులను విదేశాల నుంచి రప్పించారన్నారు. రాష్ట్రంలో రైతులు దుర్భరస్థితులను ఎదుర్కొంటున్నారన్నారు. జగన్ పాలనలో రైతులకు ఎంతో మేలు జరిగిందన్నారు. కూటమి పాలనలో రైతులు కష్టాల్లో కూరుకుపోయారన్నారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి రుద్రరాజు చిన్నరాజా, కార్యదర్శి పాటి శివకుమార్, నాయకులు రుద్రరాజు రంగరాజు, మోకా సురేష్, గుబ్బల రమేష్, పితాని రామ్మోహన్ రావు, నల్లి తిమోతి, తాడి సహదేవ్, ఇనుమర్తి నాగరాజు, ఈద రవిరెడ్డి, చెల్లింగి నాగరాజు, కూనపరెడ్డి రాంబాబు తదితర నాయకులు పాల్గొన్నారు.

రైతులకు బాసటగా నిలుద్దాం

కొత్తపేట: వైఎస్సార్ సీపీ తలపెట్టిన అన్నదాత పోరు నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేద్దామని ఆ పార్టీ ఎస్సీ విభాగం జిల్లా అధ్యక్షుడు గొల్లపల్లి డేవిడ్‌రాజు పిలుపునిచ్చారు. ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో ఎరువులు బ్లాక్ మార్కెట్, యూరియా కొరతపై రైతుల తరపున మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు మంగళవారం »అన్నదాత పోరు« పేరిట నిరసన కార్యక్రమం చేపట్టనున్నారు. జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు చిర్ల జగ్గిరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించే ఈ కార్యక్రమానికి సంబంధించి సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద అముడా మాజీ చైర్మన్ డేవిడ్‌రాజు, ఎంపీపీ గంగాధరరావు, జిల్లా పార్టీ ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, సీనియర్ వైఎస్సార్ సీపీ నాయకుడు వెంకటేశ్వరరావు, సర్పంచ్ రెడ్డి చంటి, నియోజకవర్గ రైతు విభాగం అధ్యక్షుడు పెదపూడి బాపిరాజు తదితరులు సమావేశమై వివిధ అంశాలను సమీక్షించారు. అనంతరం వారు మాట్లాడుతూ, గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వ్యవసాయాన్ని ప్రోత్సహించి రైతులకు అన్ని విధాలుగా ఆదుకుందన్నారు.

నేడు కార్యక్రమం సాగుతుంది ఇలా..

అన్నదాత పోరు పేరిట నిర్వహించే కార్యక్రమం మంగళవారం ఉదయం 8 గంటలకు రావులపాలెం, ఆత్రేయపురం, ఆలమూరు మండలాల నాయకులు, కార్యకర్తలు, రైతులు రావులపాలెం పార్టీ కార్యాలయం వద్దకు చేరుకుంటారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు జగ్గిరెడ్డి ఆధ్వర్యంలో పాదయాత్రగా ఆర్‌డీఓ కార్యాలయానికి వెళ్లి వినతిపత్రం అందజేస్తారు. ఆ మేరకు డేవిడ్‌రాజు ఆధ్వర్యంలో డీఎస్పీ మురళీమోహన్‌ను కలిసి అనుమతి కోరారు. ఈ కార్యక్రమాల్లో గ్రామ పార్టీ అధ్యక్షుడు సలాది బ్రహ్మాజీ, రైతు విభాగం ఉపాధ్యక్షుడు వీరన్న తదితరులు పాల్గొన్నారు.



కొత్తపేటలో విలేకరులతో మాట్లాడుతున్న డేవిడ్‌రాజు, గంగాధరరావు తదితరులు

బాధితులను పరామర్శించిన జగ్గిరెడ్డి



ఐశ్వర్యను పరామర్శిస్తున్న చిర్ల జగ్గిరెడ్డి

రావులపాలెం: డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పుట్టిన రోజున ఈతకోటలో జనసైనికులు, పవన్ అభిమానులు చేసిన దాడిలో గాయపడిన బాధితులను సోమవారం మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చిర్ల జగ్గిరెడ్డి పరామర్శించారు. పవన్ జన్మదిన వేడుకల్లో భాగంగా అభిమానులు, జనసైనికులు చేసిన అల్లరిని ప్రశ్నించిన వారిపై దాడి చేశారు. ఈ దాడిలో అక్కడ ఉన్న మానే వెంకట ఐశ్వర్య అనే 8ఏళ్ల చిన్నారి భుజానికి గాయమైంది. కొత్తపేట గవర్నమెంట్ ఆసుపత్రిలో చికిత్స అనంతరం ఈతకోటలోని తన ఇంటికి చేరింది. అదే రోజు పాపను ఆస్పత్రికి వెళ్లి పరామర్శించి సరైన వైద్యం అందించాలని జగ్గిరెడ్డి వైద్యులను కోరారు. సోమవారం ఆస్పత్రి నుంచి ఇంటికి చేరిన పాపను జగ్గిరెడ్డి పరామర్శించి ధైర్యం చెప్పారు. రూ.10 వేలు ఆర్థిక సాయం అందజేసి పాప వైద్యానికి ఖర్చు చేయమని కుటుంబ సభ్యులకు సూచించారు. ఈ దాడిలో గాయపడి మరో ఇద్దరు బాధితులైన మట్టా సుబ్బలక్ష్మి, మట్టా సూర్యనారాయణను కూడా జగ్గిరెడ్డి వారి స్వగృహాలకు వెళ్లి పరామర్శించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బ్లాక్ మార్కెట్‌ను ప్రోత్సహిస్తున్న కూటమి



పోతవరంలో పోస్టర్‌ను విడుదల చేస్తున్న శ్రీనివాసరావు, జిన్నూరి, చెల్లుబోయిన తదితరులు

పి.గన్నవరం: కూటమి ప్రభుత్వం రైతులకు కనీసం యూరియా కూడా సక్రమంగా సరఫరా చేయకుండా ఇబ్బందులకు గురి చేస్తూ, దళారులకు మేలు జరిగేలా యూరియా బ్లాక్ మార్కెట్‌ను ప్రోత్సాహిస్తున్నదని వైఎస్సార్ సీపీ పి.గన్నవరం నియోజకవర్గ కో–ఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాసరావు, రైతు విభాగం రాష్ట్ర అధ్యక్షుడు జిన్నూరి వెంకట రామారావు ఆగ్రహం వ్యక్తం చేశారు. పోతవరంలోని పార్టీ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. యూరియా బ్లాక్ మార్కెట్‌ను నిరసిస్తూ కొత్తపేటలో మంగళవారం ఉదయం 9 గంటలకు ఆర్డీఓ కార్యాలయం వద్ద జరిగే నిరసన కార్యక్రమానికి నియోజకవర్గం నుంచి పెద్ద ఎత్తున పార్టీ శ్రేణులు, రైతులు తరలిరావాలని పిలుపునిచ్చారు. దీనికి సంబంధించిన పోస్టరును విడుదల చేశారు. అధికారులు యూరియా అందుబాటులో ఉందని చెబుతున్నా, రైతులకు మాత్రం దొరకడం లేదన్నారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి చెల్లుబోయిన శ్రీనివాసరావు, మాజీ ఎమ్మెల్యే పాముల రాజేశ్వరీదేవి, సీనియర్ నాయకులు పి.కె.రావు, మందపాటి కిరణ్ కుమార్ మాట్లాడుతూ, పోరుబాటకు అందరూ మద్దతు ఇవ్వాలని కోరారు. మండల శాఖల అధ్యక్షులు యన్నాబత్తుల ఆనంద్, కొమ్ముల రాము, విత్తనాల ఇంద్రశేఖర్, ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, జెడ్పీటీసీ బూడిద వరలక్ష్మి, రాష్ట్ర నాయకులు అడ్డగళ్ల వెంకట సాయిరామ్, నక్కా వెంకటేశ్వరరావు, మెల్లం మహలక్ష్మీ ప్రసాద్, పితాని నర్సింహరావు, వాసంశెట్టి తాతాజీ, జక్కంపూడి వాసు, కుడుపూడి విద్యాసాగర్, కె.ఏసు, తులా గోపాలకృష్ణ, నీతిపూడి గణేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

జగ్గిరెడ్డి ఆర్థిక సాయం

రావులపాలెం: మండలంలోని ఈతకోటలో ఆదివారం రాత్రి జరిగిన అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన బాధిత కుటుంబాన్ని సోమవారం మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చిర్ల జగ్గిరెడ్డి పరామర్శించారు. పార్టీ నాయకుడు కొడమంచిలి శేఖర్ అత్తయ్య కొల్లి సత్యవతి ఇల్లు అగ్ని ప్రమాదంలో పూర్తిగా కాలిపోయింది. ఈ ఘటన తెలిసి జగ్గిరెడ్డి సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించి బాధితులను ఓదార్చారు. అనంతరం బాధిత కుటుంబానికి బియ్యం, నిత్యావసరాలు, రూ.5 వేలు నగదు అందజేశారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

రావులపాలెం: కాన్సర్‌తో బాధపడుతున్న బాధితురాలి వైద్యానికి స్థానిక కాశీ అన్నపూర్ణాదేవి సేవా సంస్థ సభ్యులు రూ.11 వేలు ఆర్థిక సాయాన్ని సోమవారం అందజేశారు. పశ్చిమగోదావరి జిల్లా తూర్పువిప్పర్రుకి చెందిన గుత్తుల లక్ష్మి (49) గర్భాశయ క్యాన్సర్‌తో కీమో ట్రీట్మెంట్ చేయించుకుంటున్నారు. ఆర్థిక స్థోమత లేక సేవా సంస్థ సభ్యులను సాయం కోరారు. రావులపాలెంలో లక్ష్మి కుమారుడు వెంకటదుర్గా వరప్రసాద్‌కి సంస్థ సభ్యుల చేతుల మీదుగా చెక్కును అందజేశారు.



బాధిత కుటుంబానికి సాయం అందజేస్తున్న జగ్గిరెడ్డి

పీహెచ్‌సీలను ఆరోగ్యవంతంగా ఉంచాలి

అంబాజీపేట: ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు వచ్చే రోగులకు ఎటువంటి అంటు వ్యాధులు ప్రభలకుండా సంపూర్ణ ఆరోగ్య కేంద్రాలుగా ఉంచడమే ముఖ్య లక్ష్యమని జిల్లా ప్రోగ్రాం మోనటరింగ్ అధికారి డాక్టర్ శ్రీనివాస్ అన్నారు. స్వచ్ఛ భారత్, స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా అంబాజీపేట, ముక్కామల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను సోమవారం తనిఖీ చేశారు. శ్రీనివాస్ మాట్లాడుతూ, ఆరోగ్య కేంద్రాల్లో రోగులకు అందుతున్న వైద్య సేవలు, పారిశుధ్యం తదితర అంశాలను పరిశీలించి, వాటి నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామన్నారు.

ఆస్పత్రి పనితీరు, పారిశుధ్యం తదితర అంశాలను పరిగణలోకి తీసుకొని అవార్డులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రదానం చేస్తాయన్నారు. తమ పరిధిలోని అంబాజీపేట, ముక్కామల, గోడిలంక, బెండమూరిలంక, నగరం, అమలాపురం అర్బన్, తాటిపాక, నాగుల్లంక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను పరిశీలించామన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి శ్రీనివాస్, ఎ.రాధా నరసింహం, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వరదకు కొట్టుకుపోయిన రోడ్డు



వరదకు పూర్తిగా దెబ్బతిన్న అప్పనపల్లి ఆర్అండ్‌బీ రోడ్డు

మామిడికుదురు: అసలే అధ్వానపు రోడ్డు. ఈ రోడ్డుపై ప్రయాణం అంటే హడలిపోయే పరిస్థితి. రోడ్డు అధ్వాన పరిస్థితితో ప్రయాణికులు, ప్రజలు నిత్యం ఎన్నో అవస్థలు పడుతున్నారు. స్వామి వారి దర్శనానికి వచ్చే భక్తులకు సైతం ఇబ్బందులు తప్పడం లేదు. ఈ పరిస్థితుల్లో వచ్చిన గోదావరి వరద రోడ్డును మరింత ఛిద్రం చేసింది.

ఇదీ అప్పనపల్లి ఆర్అండ్‌బీ రోడ్డు దుస్థితి.

గోదావరి వరద ఉధృతికి ఈ రోడ్డు ఎక్కడికక్కడ కొట్టుకుపోయింది. దీంతో తారు లేచిపోయి బ్లాక్ మెటల్ ప్రయాణికుల సహనానికి పరీక్ష పెడుతోంది. ఈ రోడ్డుకు త్వరగా మోక్షం కలిగించి రోడ్డును అభివృద్ధి చేయాలని స్థానిక ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

సమస్యలపై ఉపాధి కూలీల నిరసన



సఖినేటిపల్లి ఎంపీపీ కార్యాలయం వద్ద సమస్యలపై కదం తొక్కిన కూలీలు, మేట్స్

సఖినేటిపల్లి: తమ సమస్యలను తక్షణం పరిష్కరించాలని అధికారులను డిమాండ్ చేస్తూ సోమవారం ఉపాధి కూలీలు, మేట్స్ అధిక సంఖ్యలో తరలివచ్చి గ్రీవెన్స్ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. అంతకు ముందు సఖినేటిపల్లి లాకుల వద్ద నుంచి అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఉపాధి కూలీల సంఘ అధ్యక్షుడు ముత్యాల శ్రీనివాసరావు, ఉపాధి మేట్స్ సంఘ మండల అధ్యక్షురాలు చిట్టూరి నిర్మల కుమారి ఆధ్వర్యంలో కూలీలు, మేట్స్ ర్యాలీగా వెళ్లి నిరసన చేశారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయం వద్ద నినాదాలు చేశారు. వేతనాలు తక్షణం చెల్లించాలని, మేట్స్‌కు గౌరవ వేతనం ఇవ్వాలని, ఉపాధి పనులు ప్రారంభించాలని, ఉపాధి వేతనం రూ.500కు పెంచాలని, ప్రతి కుటుంబానికి కచ్చితంగా 100 రోజులు పని దినాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఒక వినతిపత్రాన్ని ఎన్ఆర్‌జీఎస్ ఏపీవో నాగప్రసాద్‌కు అందజేశారు. కాగా, ఉపాధి కూలీలకు రెండు నెలల నుంచి వేతనాలు అందక ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని, కూలీలకు పని చేసిన 15 రోజులకు వేతనాలు ఇవ్వాలని ఉపాధి హామీ చట్టంలో నిబంధన ఉన్నప్పటికీ అధికారులు పాటించకపోవడం విచారకరమని శ్రీనివాసరావు పేర్కొన్నారు. ధర్నాలో మానవ హక్కుల వేదిక ప్రతినిధి యేడిద రాజేష్, దళిత బహుజన మహిళా శక్తి జాతీయ కన్వీనర్ రాజామణి, బహుజన సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షుడు బూశి జాన్‌మోషే, సీపీఎం సీనియర్ నాయకుడు చెవ్వాకుల సూర్యప్రకాశరావు మద్దతు పలికారు.

కళా రూపాలపై చైతన్యం కల్పించాలి

ఆలమూరు: ప్రజా కళారూపాల ద్వారా ప్రజల్లో చైతన్యం కలిగించాలని ప్రజా నాట్య మండలి జిల్లా కన్వీనర్ శామ్యూల్ అన్నారు. ఆలమూరులో ఉన్న సమత స్వచ్ఛంద సంస్థ కార్యాలయంలో సోమవారం రాష్ట్ర ప్రజా నాట్యమండలి వ్యవస్థాపక అధ్యక్షుడు గరికపాటి రాజారావు 62వ వర్ధంతి సభ జరిగింది. కార్యక్రమానికి సీపీఐ సీనియర్ నేత చంద్రరావు అధ్యక్షతన వహించగా.. పలువురు ప్రముఖులు పాల్గొని ప్రసంగించారు. ఈ ఏడాది డిసెంబర్ 26 నాటికి సీపీఐ ఏర్పాటై వందేళ్లు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా పార్టీ, అనుబంధ సంస్థ కార్యకర్తలు రెట్టించిన ఉత్సాహంతో కళారూపాల ద్వారా ప్రజలకు పార్టీ చేసిన సేవలను వివరించాలన్నారు. అనంతరం కామ్రేడ్ రాజారావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఏఐఎస్‌ఎఫ్ అధ్యక్షుడు వెంకట్, కార్యదర్శి జి.రవికుమార్, సీపీఐ నేతలు కె.రామకృష్ణ, యేసురాజు తదితరులు పాల్గొన్నారు.

యూరియా దిగుమతి చేస్తున్నాం

సాక్షి ఇంపాక్ట్

కొత్తపేట: మండలంలో రైతులకు అవసరమైన మేరకు యూరియా దిగుమతి చేస్తున్నామని ఏఓ) ద్వార కాదేవి తెలిపారు. ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో వ్యవసాయ, ఉద్యాన పంటలకు అవసరమైన యూరియా అన్ని ఆర్ఎస్‌కేలు, సొసైటీలు, డీలర్ల వద్ద లేక రైతులు ఇబ్బందులపై సోమవారం సాక్షిలో **యూరియా కరవాయె!** శీర్షికన ప్రచురితమైన కథనంపై ఏఓ స్పందించారు. ఈ మేరకు ఓ ప్రకటన విడుదల చేశారు. మండలంలో 15,089.63 ఎకరాల్లో వ్యవసాయ, ఉద్యాన పంటలు సాగు చేస్తున్నారని, ఆ పంటలకు 978.16 మెట్రిక్ టన్నుల యూరియా అవసరం కాగా, ఇప్పటికే 892.952 మెట్రిక్ టన్నులు ఆర్ఎస్‌కే, సొసైటీలు, ప్రైవేట్ డీలర్ల ద్వారా రైతులకు సరఫరా చేశామని, ఇంకా 85.205 మెట్రిక్ టన్నులు అవసరం కాగా, 10 రోజుల్లో అందుబాటులో ఉంచుతామని పేర్కొన్నారు.

రైతులకు అవగాహన

ఆత్రేయపురం మండలం వద్దిపర్రు రైతు సేవా కేంద్రం వద్ద అధికారులు యూరియా కొరతపై ఫార్మర్ ఔట్ రీజ్ పేరిట రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అవసరమైన మేరకు యూరియా అందుబాటులో ఉంచుతామని భరోసా కల్పించారు. తహసీల్దార్ రాజేశ్వరరావు, ఏడీఏ వెంకటరామారావు, ఏఓ భార్గవమహేష్, వీఆర్‌ఓ ఎలీషా, వీఏఏలు పాల్గొన్నారు.

నానో యూరియాతో రైతులకు మేలు

పి.గన్నవరం: నానో యూరియా వాడటం వల్ల తక్కువ ఖర్చుతో మొక్కలకు ఎరువులు అందించవచ్చని ఇన్‌చార్జి ఏడీఏ సీహెచ్‌డీ విజయకుమార్ అన్నారు. మండలంలోని ముంగండ, ముంగండపాలెం, రాజులపాలెం, పి.గన్నవరం గ్రామాల్లో వరిలో ఎరువుల వినియోగం, యూరియా సరఫరా, నానో యూరియా వాడకంపై రైతులకు అవగాహన సదస్సులు నిర్వహించారు. తహసీల్దార్ పి.శ్రీపల్లవి, మండల ప్రత్యేకాధికారి, హౌసింగ్ పీడీ నరసింహరావు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ముంగండ సొసైటీలో 10.125 టన్నులు, నాగుల్లంక రైతు సేవా కేంద్రంలో 10.125 టన్నుల యూరియాను అందుబాటులో ఉంచినట్టు విజయకుమార్ వివరించారు. నానో యూరియా వాడటం వల్ల రైతులకు మేలు జరుగుతుందన్నారు.

యూరియా సరఫరాపై ఆందోళన వద్దు

ఆలమూరు: జిల్లాలో యూరియా సరఫరాపై రైతులు ఆందోళన చెందవద్దని కలెక్టర్ మహేష్ కుమార్ అన్నారు. యూరియా నిల్వలపై రైతుల్లో నెలకొన్న ఆందోళనను తొలగించేందుకు మండలంలోని జొన్నాడలో సోమవారం ఆయన పర్యటించారు. తొలసరి సాగు ఎదుర్కొంటున్న సమస్యలను రైతులను అడిగి తెలుసుకున్నారు. డ్రోన్‌ల వల్ల కలిగే ప్రయోజనాలపై ఆరా తీసారు. యూరియాతో పాటు నానో యూరియా ఉత్పత్తులను వినియోగించాలని రైతులకు విజ్ఞప్తి చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, జిల్లాలో ఖరీఫ్ సాగుకు 16 వేల మెట్రిక్ టన్నుల యూరియా అవసరం కాగా, 21 వేల మెట్రిక్ టన్నుల యూరియా వచ్చిందని, ఇప్పటికే 20 వేల మెట్రిక్ టన్నులు రైతులకు సరఫరా చేశామన్నారు. అయితే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జగ్గిరెడ్డి మంగళవారం కొత్తపేట ఆర్‌డీఓ కార్యా లయం వద్ద నిర్వహించనున్న రైతు పోరుబాటకు వస్తున్న స్పందనను చూసి అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటిస్తున్నారనే అభిప్రాయం వ్యక్తమవుతుంది.

మామిడికుదురు: రైతులకు అవసరమైన యూరియా దిగుమతి అవుతోందని మండల ప్రత్యేకాధికారి మధుసూధన్, ఏఓ సత్యనారాయణ తెలిపారు. ఆదుర్రు, కొమరాడ గ్రామాల్లో సోమవారం రైతులతో యూరియా సరఫరాపై అవగాహన సదస్సు జరిగింది. సొసైటీలు, ప్రైవేటు డీలర్లకు 50 మెట్రిక్ టన్నుల యూరియా వచ్చిందన్నారు. రెండు రోజుల్లో మరికొంత యూరియా దిగుమతి అవుతుందని చెప్పారు. సమావేశాల్లో సర్పంచ్‌లు బళ్ల శ్రీనివాస్, వలవల సత్యవేణి, డిప్యూటీ తహసీల్దార్ శరణ్య, ఆర్ఐ ఇబ్రహీమ్, వీఆర్వోలు పాల్గొన్నారు.

విద్యుత్ సబ్‌స్టేషన్ ప్రారంభం

సఖినేటిపల్లి: మండలంలోని గుడిమూలలో సోమవారం నూతనంగా రూ.7 కోట్లతో నిర్మించిన 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌ను రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ ప్రారంభించారు. ఈ సబ్‌స్టేషన్ వల్ల స్థానికంగా, సరిహద్దు ఏరియాల్లో లో వోల్టేజీ సమస్యలకు పరిష్కారం చూపుతుందన్నారు. సర్పంచ్ శ్రీహరిరాజు, ఏపీ మార్క్ ఫెడ్ డైరెక్టర్ జీ.పెదకాపు, నాయకులు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన అవార్డు గ్రహీతలు



కలెక్టర్‌ను కలిసిన ప్రభావతి, నిరంజని, దుర్గాప్రసాద్

సఖినేటిపల్లి: అమలాపురం కలెక్టరేట్‌లో సోమవారం కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా సఖినేటిపల్లి లంక జెడ్పీ ఉన్నత పాఠశాల స్కూల్ అసిస్టెంట్, రాష్ట్ర ఉత్తమ టీచర్ అవార్డు గ్రహీత ప్రభావతి కలిశారు. ఆమెతోపాటు అంబేడ్కర్ కోనసీమ జిల్లాకు చెందిన రాష్ట్ర ఉత్తమ టీచర్ అవార్డు గ్రహీతలు ఆలేటి దుర్గా ప్రసాద్, చిట్నీడి నిరంజని కూడా కలెక్టర్‌ను కలిసిన వారిలో ఉన్నారు. ఈ మేరకు వారిని కలెక్టర్ అభినందించారు.

పాఠశాలకు మైక్ సిస్టం బహూకరణ

కొత్తపేట: వాడపాలెం జెడ్పీ ఉన్నత పాఠశాలకు రిటైర్డ్ ఉపాధ్యాయురాలు గౌరీకృష్ణ పబ్లిక్ అడ్రస్ సిస్టం బహూకరించారు. స్థానిక ప్రియదర్శినీ బాలవిహార్ వ్యవస్థాపకులు అద్దంకి కేశవరావు- పద్మావతి దంపతులు వాడపాలెం హయ్యర్ ఎలిమెంటరీ పాఠశాలలో 14 ఏళ్లు ఉపాధ్యాయులుగా పనిచేశారు. గౌరీకృష్ణ గతేడాది ఏప్రిల్ 31న వాడపాలెం పాఠశాలలో పదవీ విరమణ చేశారు. సోమవారం కేశవరావు జయంతిని పురస్కరించుకుని ఆయన కోడలు గౌరీకృష్ణ రూ.17,500 విలువ చేసే మైక్ అండ్ సౌండ్ సిస్టం పాఠశాలకు బహూకరించారు.